సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ; 29 ; ఫిబ్రవరి ; 2024



ఘనంగా జలాభిషేకం

విశాఖ నగరంలోని దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం ఘనంగా నిర్వహించారు.

8లో



విశాఖ చేరిన సీ295

భారత నౌకాదళానికి చెందిన బహుముఖ రవాణా విమానం సీ295 బుధవారం విశాఖపట్నం చేరుకుంది.

8లో



వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

8లో

న్యూస్‌రీల్

‘ఏకలవ్య’లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మారేడుమిల్లి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఆంగ్ల మీడియం విద్యాలయంలో 6,7,8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.అరుణ కుమారి తెలిపారు. వచ్చే నెల 31 నాటికి ఆన్‌లైన్‌లో సమర్పించాలని ఆమె సూచించారు. దరఖాస్తుదారులకు ఏప్రిల్ 13న రాత పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకోసం దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

గోదావరి పడవ రేవుకు వేలం

కూనవరం: పడవ ప్రయాణానికి సంబంధించి 2024–25 సంవత్సరానికిగాను స్థానిక గ్రామ పంచాయతీలో కార్యాలయంలో మార్చి ఒకటో తేదీన వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి సురేష్ తెలిపారు. మండలంలోని కూనవరం గ్రామ పంచాయతీ, ఏలూరు జిల్లా వెలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామ పంచాయతీల పరిధిలో గోదావరి నదిపై ప్రయాణికులను కూనవరం నుంచి రుద్రమకోటకు, రుద్రమకోట నుంచి కూనవరం చేరవేసేందుకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 13 వినతులు



దరఖాస్తును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్పందనలో 13 వినతులు స్వీకరించినట్టు పీవో కావూరి చైతన్య తెలిపారు. భూ సమస్యలు, జీవనోపాధి, పోడుపట్టాలు తదితర అంశాలపై ప్రజల నుంచి అర్జీలు అందాయి. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం ఆలస్యమైతే దానికి సంబంధించి తగిన కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే తనను కలిసి ఫిర్యాదు చేయాలని అర్జీదారులకు సూచించారు.


ఆహార పదార్థాల శాంపిళ్ల సేకరణ



సేకరించిన ఆహార పదార్థాల శాంపిళ్లతో వేణుగోపాలరావు

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలలో ఆహార పదార్థాల శాంపిళ్లను జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి బి.వేణుగోపాలరావు సేకరించారు. ఇదే పాఠశాలలో విద్యార్థులు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు ఆయన బుధవారం సందర్శించారు. దీనిలో భాగంగా వంటశాలను, విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. వీటి నుంచి నమూనాలు సేకరించారు. తాగు నీటిని పరీక్షించారు. మూడు మోటార్ల నుంచి వచ్చే నీటి నుంచి కూడా నమూనాలు సేకరించారు. వీటిని ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తాయని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ మోహన్ పాల్గొన్నారు.

పవర్ కెనాల్‌కు మరమ్మతులు



డొంకరాయి పవర్ కెనాల్‌కు జరుగుతున్న మరమ్మతు పనులు

మోతుగూడెం: సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి నుంచి పోర్‌బై వరకు సుమారు 16 కిలోమీటర్ల పవర్ కెనాల్‌కు ప్లాస్టింగ్, గ్రౌటింగ్, కాంక్రీట్ పనులను అధికారులు ప్రారంభించారు.ఐదు రోజులపాటు జరిగే ఈ పనులను రూ.50లక్షలతో చేపట్టినట్టు ఎస్‌ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేశారు. కెనాల్ దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టినట్టు ఎస్‌ఈ తెలిపారు. రీచ్ వన్, రీచ్ టూలో పది మంది కాంట్రాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

పర్యాటకం పరుగులు..

ప్రగతి వెలుగులు

సహజసిద్ధ అందాలతో పర్యాటకులను ఆకట్టుకుంటూ మేఘాల కొండగా ప్రాచుర్యం పొందిన వంజంగి హిల్స్ గిరి యువతకు ఉపాధి నివ్వడమే కాకుండా, పరిసర గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తోంది.ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకుల నుంచి వచ్చే ఆదాయాన్ని గిరి యువతకు, పరిసర గ్రామాల్లో అభివృద్ధికి అధికారులు వెచ్చిస్తున్నారు.

- ప్రవేశ, పార్కింగ్ రుసుం ఆదాయంతో అభివృద్ధి పనులు
- రెండేళ్లలో రూ.25 లక్షల మేర వసూలు
- వంజంగి, లగిశపల్లి, కాడెలి పంచాయతీల పరిధిలో మౌలిక వసతులు
- నిధులను సద్వినియోగం చేసుకుంటున్న గిరిజనులు



వంజంగి హిల్స్ ఆదాయంతో బొర్రమామిడి వద్ద రహదారికి నిర్మించిన రిటైనింగ్ వాల్



పాఠశాల భవనానికి మరమ్మతులు



వంజంగి కొండపై నిర్మిస్తున్న బయో టాయిలెట్స్

పాడేరు : జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి పరంగా పరుగులు పెడుతుండగా తద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో ప్రగతి వెలుగులు విరజిమ్ముతున్నాయి. పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయాన్ని మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తున్నారు. మేఘాల కొండగా గుర్తింపు పొందిన వంజంగి సందర్శనకు ఏటా వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరి నుంచి ప్రవేశానికి, పార్కింగ్‌కు రుసుం వసూలు చేస్తున్నారు. ఈనిధులను వృథా చేయకుండా వంజంగి పరిధిలోని గ్రామాల్లో సదుపాయాల కల్పనకు వెచ్చిస్తున్నారు.

రెండేళ్లలో రూ.25 లక్షలు..

వంజంగి కొండ ప్రాంతాన్ని ఆనుకుని వంజంగి, లగిశపల్లి, కాడెలి గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలు ఉన్నాయి. గత 2022 నుంచి 2024 వరకు రూ.25లక్షలు ప్రవేశ, పార్కింగ్ రుసుంల ద్వారా ఆదాయం వచ్చింది. ఈ నిధులను ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సాయిన వీన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, మౌలిక వసతులకు కేటాయించారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. పర్యాటకం ద్వారా వచ్చిన సొమ్ముతో అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు వెచ్చిస్తుండటంతో ఆ ప్రాంత గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వంజంగి పంచాయతీలో..

- ఎస్. కొత్తూరులో పాఠశాల భవనానికి రూ.2.40లక్షలతో మరమ్మతులు
- కొత్తవలస బీటీ రోడ్డు నుంచి కొత్తవలస వరకు రూ.2.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- కొత్తవలసలో రూ.2.80 లక్షలతో పాఠశాల భవనానికి మరమ్మతులు
- దొడ్డిపల్లి, వై.సంపల గ్రామాల్లో రూ.1.60లక్షలతో సంపు కట్టడానికి మరమ్మతులు
- వంజంగి వ్యూ పాయింట్ వద్ద సైన్ బోర్డుల ఏర్పాటు
- వంజంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.81వేలతో విద్యుత్ దీపాల ఏర్పాటు

లగిసపల్లి పంచాయతీలో..

- లగిసపల్లి గ్రామ సచివాలయం పరిధిలో పారిశుధ్య పనుల నిమిత్తం రూ.1.50లక్షలతో పరికరాల కొనుగోలు
- సంపంగిగరువు గ్రామంలో రూ.60 వేలతో కాలువకు మరమ్మతులు
- లగిసపల్లి గ్రామ సచివాలయం సమీపంలో రూ.2.40 లక్షలతో కాజ్‌వే నిర్మాణం
- లగిసపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.81 వేలతో వీధి దీపాల ఏర్పాటు

కాడెలి పంచాయతీలో..

- గురుపల్లి మెయిన్‌రోడ్డు నుంచి పాఠశాల వరకు రూ.1.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- వర్తనపల్లి గ్రామంలో పాఠశాల భవనానికి రూ.2.40లక్షలతో మరమ్మతులు
- గురుపల్లి గ్రామంలో పాఠశాల భవనానికి రూ.2.15 లక్షలతో మరమ్మతులు
- గురుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.81వేలతో వీధి దీపాల ఏర్పాటు

ఐటీడీఏ సహకారంతో..

పాడేరు ఐటీడీఏ సహకారంతో వంజంగి కొండపై 11 బయో టాయిలెట్లు నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.4.5లక్షలు కేటాయించింది.

సీజన్‌లో 15 మందికి ఉపాధి

వంజంగి హిల్స్ పార్కింగ్, ప్రవేశ రుసుం వసూలు ద్వారా సీజన్‌లో 15 మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఒకొక్కరికి రూ.7 వేల చొప్పున చెల్లిస్తున్నారు.

నిధులు సద్వినియోగం



వంజంగి పర్యాటకంలో భాగంగా టికెట్ల రూపంలో ఆదాయం సమకూరుతోంది. ఈ రెండేళ్లలో రూ.25లక్షలు సమకూరాయి. వంజంగి పర్యాటకానికి ఆనుకొని ఉన్న మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు వెచ్చిస్తున్నాం. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు వంజంగి మేఘాల కొండపై పర్యాటకుల సౌకర్యార్థం బయో టాయిలెట్స్ నిర్మాణం చేపడుతున్నాం. ఆయా చోట్ల పనులు ఇప్పటికే కొన్ని పూర్తికాగా మరికొన్ని చివరి దశలో ఉన్నాయి.

– కె.సాయినవీన్, ఎంపీడీవో, పాడేరు

1.73 లక్షల మందికి

రూ.35.27 కోట్లు జమ

- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ
- రైతు భరోసా, సున్నా వడ్డీ పథకంతో భారీగా లబ్ధి



రైతులకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 1.73 లక్షల మంది రైతులకు రైతు భరోసా, సున్నా వడ్డీ పథకం కింద నగదు జమ చేసి ఎంతో మేలు చేసిందని, వారి ఖాతాల్లో రూ.35.27 కోట్లు ప్రభుత్వం జమచేసిందని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. రైతులకు ఐదో సంవత్సరం రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. సీఎం బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమచేశారు. రైతు భరోసా ప్రత్యక్ష కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడంతో సీఎం ప్రసంగాన్ని అధికారులు, రైతులంతా వీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,71,215 మంది రైతులకు రైతు భరోసా పథకంలో రూ.34 కోట్ల 83 లక్షల 29 వేల 500, సున్నా వడ్డీ కింద 2,133 మంది రైతులకు 43లక్షల 78వేల 300లను ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసిందన్నారు. ప్రభుత్వ సాయాన్ని గిరిజన రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్, పలు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం



రంపచోడవరంలో సెక్టార్ అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

- సహకరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ సూచన
- గుర్తేడు, పాతకోట ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల సందర్శన
- ఈవీఎంలు తరలించేందుకు హెలిప్యాడ్ ఏర్పాటు ప్రదేశం పరిశీలన
- సమస్యలు గుర్తిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటా



గుర్తేడు గ్రామ సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటుచేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

వై.రామవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంతకుమార్ కోరారు. మండల ఎగువప్రాంతం గుర్తేడు, పాతకోట తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. పోలింగ్ అనంతరం పాతకోట, గుర్తేడు నుంచి ఈవీఎంలను రంపచోడవరం తీసుకువెళ్లేందుకు ఏర్పాటుచేయనున్న హెలిప్యాడ్ ప్రదేశాన్ని అక్కడికి వెళ్లే రోడ్డుమార్గం పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక భద్రత వలయంలో ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, గుర్తేడు సర్పంచ్ గొర్లె దుష్యంతుడు, అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు తప్పనిసరి

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలకు గాను 59 మంది సెక్టార్ అధికారులను నియమించినట్టు చెప్పారు. కేటాయించిన రూట్లలో ఎప్పటికప్పుడు పర్యటించి రూట్ మ్యాప్‌లు అందుబాటులో పెట్టుకోవాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ప్రకృతి అందాలు తిలకించేందుకే వ్యూపాయింట్



పోచవరంలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద పీవో దంపతులు


చింతూరు: ప్రకృతి అందాలను పర్యాటకులు తిలకించేందుకు వీలుగా వ్యూపాయింట్ ఏర్పాటుచేశామని స్థానిక ఐటీడీఏ పీవో ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. వీఆర్‌పురం మండలం పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద ఐటీడీఏ ఆధ్వర్యంలో ఐలవ్ పాపికొండలు పేరుతో ఏర్పాటు చేసిన ఏర్పాటుచేసిన వ్యూ పాయింట్‌ను బుధవారం ఆయన సతీమణి రేపల్లె ఆర్డీవో హెలా షారోన్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వారు బోట్‌లో ప్రయాణించి గోదావరి అందాలను తిలకించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి విహార యాత్రకు వచ్చే పర్యాటకులు గోదావరి అందాలను తిలకించేందుకు లాంచీలు నిలిచేచోట ఎత్తయిన ప్రాంతంలో వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యాటకులు ప్రకృతి అందాల మధ్య సెల్ఫీలు దిగేందుకు వ్యూ పాయింట్ ఉపయోగ పడుతుందన్నారు. బోటు ప్రయాణంపై పర్యాటకుల అనుభూతిని తెలుసుకున్నారు. పని భారం, ఒత్తిడి నుంచి బయటపడేందుకు పాపికొండల విహారయాత్ర ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన బోటు యజమానులతో మాట్లాడారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా స్వల్ప కాలిక ఉచిత కోర్సులను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తిగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు వచ్చే నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఉండే ఈ కోర్సులకు సంబంధించిన వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని ఆయన కోరారు.

నాలుగు పోలింగ్ కేంద్రాల మార్పు

భద్రత కారణాల దృష్ట్యా తరలింపు



పీఎల్ కొత్తూరు పోలింగ్ బూత్ ఏర్పాటుచేయనున్న పలకజీడి పాఠశాల భవనం

కొయ్యూరు: భద్రత కారణాల నేపథ్యంలో యూ.చీడిపాలెం పంచాయతీలో రేవులకోట, ఎం, భీమవరం పంచాయతీలో పీఎల్ కొత్తూరు పోలింగ్ కేంద్రాలను పలకజీడికి మార్పు చేశారు. బూదరాళ్ల పంచాయతీలో కన్నవరం కేంద్రాన్ని గరిమండకు, కునుకూరు కేంద్రాన్ని బాలరేవులకు తరలించారు.పెదలంక, పుట్టకోటతో పాటు మరి కొన్ని గ్రామాల ప్రజలు పలకజీడికి రావాలంటే కనీసం 15 నుంచి 20 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. మావోయిస్టుల సమస్య నేపథ్యంలో దానిని పలకజీడికి మార్పు చేశారు. రేవులకోట కేంద్రాన్ని పలకజీడికి తరలించారు. 2004 ఎన్నికల్లో పలకజీడి పోలింగ్ కేంద్రంపై మావోయిస్టులు దాడి చేశారు. బాక్స్‌లను ఎత్తుకుపోయారు. ఆ తరువత 2014లోను అదే పోలింగ్ కేంద్రంపై మావోయిస్టులు దాడి చేసి ఈవీఎం యంత్రాలను తీసుకుపోయారు. పోలింగ్ సిబ్బంది జీపునకు నిప్పుపెట్టారు. ఈ పరిస్థితుల్లో భద్రత కల్పించే దృష్ట్యా పీఎల్ కొత్తూరు, రేవులకోట కేంద్రాలను పలకజీడిలో ఏర్పాటుచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సారి కన్నవరం, కునుకూరులో కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాలను సైతం మార్పు చేశారు.కన్నవరం కేంద్రం గరిమండకు, కునుకూరు కేంద్రం బాలరేవులకు తరలించామని తహసీల్దార్ రాజేశ్వరరావు తెలిపారు. భద్రతను దృష్టిలో పెట్టుకుని వాటిని మార్పు చేయాలని ఉన్నతాధికారులనుంచి అందిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

బినామీ సొమ్ము బాబు పాలు!

- జనసేనలో చక్రం తిప్పుతున్న ఇద్దరు నేతలు
- ఎంపీగా పోటీ చేస్తే ఎన్నికల ఖర్చంతా భరిస్తామని ఓ ‘బాబు’కు హామీ
- రూ. 50 కోట్ల మేర భరించేందుకు సిద్ధమని వెల్లడి
- ఇదంతా ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ సొమ్మని ప్రచారం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జనసేనకు చెందిన ‘బాబు’ను ఎంపీగా బరిలో దింపేందుకు ఆ పార్టీలోని ఇద్దరు నేతలు చేస్తున్న హడావుడి వెనుక ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ డబ్బుల గలగలలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఎంపీగా బరిలో నిలిస్తే అయ్యే మొత్తం ఖర్చును తామే భరిస్తామంటూ ఇద్దరు నేతలు సదరు బాబు ముందు ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ఆ నేత కూడా ఎంపీగా బరిలో నిలిచేందుకు నియోజకవర్గంలో హడావుడి చేస్తున్నారు. ఎన్నికల ఖర్చు రూ.50 కోట్ల వరకు తాము భరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా తమకు రెండు సీట్లు కావాలంటూ ప్రతిపాదించారు. ఇందుకు ఆ నేత కూడా ప్రాథమికంగా అంగీకరించినట్టు తెలిసింది. జనసేన అధినేతకు చెప్పి రెండు సీట్లు ఇప్పించే పూచీ నాదీ అని ఆ ‘బాబు’ కూడా హామీ ఇచ్చారని ఈ ఇద్దరూ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. పోర్టులో ఎగుమతి దిగుమతి వ్యాపారం చేసే వారికి తోడు తాజాగా పార్టీలో చేరిన మరో నేత కూడా జతకట్టారు. వీరంతా కలిసి సదరు బాబును ముగ్గులోకి దించి ముచ్చటగా తమ పని కానించుకుంటున్నట్టు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది.

బినామీగా ఉంటూ బిల్డప్!

వాస్తవానికి పెద్దగా ఆర్థికంగా బలంగా లేని సదరు నేతలు పార్టీలో ముఖ్యుల వద్ద చేస్తున్న హడావుడి చూసి పార్టీలోని ఇతర నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఓ కార్పొరేట్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తికి వీరిలో ఒకరు బినామీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పోర్టులో కాంట్రాక్టు పనిచేసే సదరు వ్యక్తితో కలిసి ఆ కంపెనీ డైరెక్టర్ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆయన ఈ నేత వద్ద భారీ మొత్తం బినామీగా ఉంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తాన్ని చూపించే ఇప్పుడు ఎన్నికల వ్యయాన్ని భరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారని పార్టీలోని సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. తాము ఫలానా కంపెనీకి బొగ్గును దిగుమతి చేశామని, రూ.100 కోట్ల బిల్లుల కోసం వెళుతున్నామంటూ ‘బాబు’ వద్ద హడావుడి చేసి బుట్టలో వేసుకున్నారని పార్టీలోని సీనియర్ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. అంతేకాకుండా కొద్దిరోజుల క్రితం ‘బాబు’ ఇంట్లో జరిగిన పెళ్లికి కూడా రూ. 2 కోట్ల మేర నగదును ఇవ్వడంతో పాటు.. ఆ పెళ్లికి కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్‌ను కూడా తమతో తీసుకెళ్లారని సమాచారం. వీరి బుట్టలో పడిన ఆ ‘బాబు’ రోజువారీ కార్యక్రమాలన్నీ వారు చెప్పినట్టే ఉంటున్నాయని సీనియర్లు వాపోతున్నారు. మరోవైపు పార్టీలో ప్రజల్లో బలం ఉన్న నేతలను కాదని... పైరవీకార్లకు ప్రాధాన్యత పెరుగుతోందని సీనియర్లు వాపోతున్నారు. పార్టీలో సీట్ల అమ్మకాలు జరిగిపోతున్నాయని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోర్టు వ్యాపారంలో ఉన్న మరో ఇద్దరు నేతలు కాస్తా... ఈ బినామీల వ్యవహారాన్ని ఆ కార్పొరేట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా జలాభిషేకం

సీతమ్మధార (విశాఖ) : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారికి భక్తులు జలాభి షేకం చేశారు. ఆలయ ఈవో జి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసరావు, కె.వి.కె. శాస్త్రి భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి పసుపు నీళ్లతో జలాభిషేకం చేయడం ద్వారా తమ కోర్కెలు నెరవేరుతాయని భావిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. సాయంత్రం కూడా అమ్మవారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విశాఖ చేరిన సీ295


స్వాగతం పలుకుతున్న అధికారులు

విశాఖ విద్య: భారత నౌకాదళంనకు చెందిన బహుముఖ రవాణా విమానం సీ295 బుధవారం విశాఖపట్నంకు చేరుకుంది. ఈఎన్‌సీకి చెందిన ఐఎన్‌ఎస్ డేగాకు తొలిసారిగా ఈ విమానం రావడంతో తూర్పు నావిక దళం అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అత్యవసర సమయంలో.. దేశంలో అంతర్గత రవాణా వ్యవస్థ బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విమానం రాక పట్ల నౌకాదళ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న పోలీసులు

చింతూరు : ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసిన చింతూరు పోలీసులు వారి వద్ద నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు పురుషులు, ఓ మహిళను ఆపి సోదాలు చేయగా 25 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిశాకు చెందిన కబాసి భీమాతో పాటు భార్యాభర్తలైన మహారాష్ట్రకు చెందిన మహమ్మద్ నయీంమీర్జా, అలియా నయీంమీర్జాలను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.50 వేలని, మహారాష్ట్రకు చెందిన అల్లావుద్దీన్ పరారయ్యాడని, గంజాయి తరలిస్తున్న బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్‌లు సీజ్ చేశామని ఆయన తెలిపారు.

ఒత్తిడి జయిస్తే విజయం మీదే..

- పరీక్షలకు సిద్ధమైన ఇంటర్ విద్యార్థులు
- రేపు ఫస్టియర్, మార్చి 2 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం


పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం మొదటి సంవత్సరం, మార్చి 2వ తేదీ శనివారం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి.

ఆలయాల్లో పూజలు

శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కళాశాలల్లో హాల్ టికెట్లు తీసుకున్న విద్యార్థులు.. వాటితో నేరుగా ఆలయాలు, చర్చిలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని సంపత్ వినాయక ఆలయం వద్ద ఇంటర్ విద్యార్థుల కోలాహలం కనిపించింది. కొంత మంది తమ తల్లిదండ్రులతో ఆలయానికి వచ్చి గణనాథుడి పాదాల చెంత హాల్ టికెట్లు ఉంచి.. పరీక్షల్లో విజయం సాధించాలని వేడుకున్నారు.

ఒత్తిడి జయిస్తే విజయం తథ్యం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులు కొలమానంగా తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ర్యాంకుల కోసం కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నారు. ఈ మొత్తం పరిణామాలతో ఇంటర్మీడియట్ పరీక్షలంటే.. విద్యార్థులకు ఎక్కడా లేని టెన్షన్ మొదలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యమని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.


ఇలా చేస్తే మేలు

- పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైన పరీక్ష రాసేందుకు కేంద్రాల్లోకి అనుమతించరు. అందుకనే పరీక్ష కేంద్రానికి సరిగ్గా సమయానికి హడావిడిగా వెళ్లేకంటే.. ముందుగానే చేరుకుంటే మంచిది. కేంద్రాల్లోకి అరగంట ముందుగానే విద్యార్థులను అనుమతిస్తారు.
- ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత టెన్షన్‌కు గురికాకుండా.. దానిని అర్థం చేసుకునేందుకు కొంత సమయం తీసుకోవాలి. సబ్జెక్టుపై అవగాహనతోనే మంచి మార్కులు కైవసం చేసుకోవచ్చు. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాస్తే, కొంత టెన్షన్ తొలగుతుంది. ప్రశ్నలన్నింటికీ జవాబులు రాసేందుకు ప్రయత్నం చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

కేంద్రాలకు వీటిని తీసుకురావొద్దు

- పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. వీటిని కేంద్రాల్లోకి అనుమతించరు. మాస్ కాపీయింగ్ వంటి చర్యలకు పాల్పడకూడదు.

ఆందోళన వీడాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకూడదు. ప్రశాంత వాతారణంలో పరీక్ష రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఏడాదంతా చదివిన సబ్జెక్టే అయినందున.. వాటిని గుర్తుకు తెచ్చుకుని రాసేందుకు ప్రయత్నించాలి. తల్లిదండ్రులు కూడా ఇంట్లో విద్యార్థులు చదువుకునేలా అనువైన వాతావరణం కల్పించాలి.

–డాక్టర్ రాజేశ్వరరావు, మానసిక వైద్య నిపుణులు

సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి




పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశాం. ఫీజు బకాయిలతో సంబంధం లేకుండానే విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని ఆదేశించాం. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి.

– పి.మురళీధర్, ఆర్‌ఐవో, విశాఖ జిల్లా

నాదెండ్ల పేరంటం!

- గూడెం సభకు పవన్ రమ్మన్నారు..
- జనసేన అసంతృప్తులకు ఫోన్లో పేరు పేరునా ఆహ్వానం
- అరకొర సీట్లపై అసహనంతో రగిలిపోతున్న శ్రేణులు
- ఉమ్మడి విశాఖ నుంచి అయిష్టంగానే వెళ్లిన కొందరు నేతలు



సాక్షి, విశాఖపట్నం: పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ తమకు అరకొర సీట్లు కేటాయించడంపై జనసేన శ్రేణులు రగిలిపోతున్నారు. తమ అధినేత పవన్ కల్యాణ్ తీరుపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పైగా ఎప్పట్నుంచో పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని కాదని నిన్నగాక మొన్న చేరిన వారికే ప్రాధాన్యతనిస్తుండడం కూడా వీరికి రుచించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన సీట్లను ఆశించి వైఎస్సార్‌సీపీ నుంచి జంప్ చేసిన నేతలకు బొటాబొటి సీట్ల కేటాయింపు మింగుడు పడడం లేదు. దీంతో వారంతా నైరాశ్యంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనలు సంయుక్తంగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుధవారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలకు లక్షల్లో జనం పోటెత్తుతున్నారు. దీంతో టీడీపీ–జనసేనల పార్టీలకు గూడెం సభ ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. పొత్తులో సీట్ల కేటాయింపునకు ముందు వరకు జనసేన శ్రేణులు ఒకింత ఉత్సాహంగా ఉండేవారు.

క్యాడర్‌లో నిరాశా నిస్పృహ

రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు టీడీపీ కేవలం 24 స్థానాలే కేటాయించడం, ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ఖరారు చేయడం వంటి పరిణామాలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆశావహులతో పాటు క్యాడరు కూడా నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. మునుపటిలా కాకుండా పార్టీ కార్యాలయాలకు, కార్యకలాపాలకు వీరు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తెరిగిన జనసేన ముఖ్యనేతలు గూడెం సభకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఆశించినంతగా హాజరుకారన్న భావనకొచ్చారు.

పవన్ సార్ రమ్మన్నారు...

దీంతో పార్టీలో పవన్ తర్వాత స్థానంలో ఉన్న నాదెండ్ల మనోహర్‌ను రంగంలోకి దించారు. రెండ్రోజుల క్రితం నుంచి ఆయన ఇక్కడ కీలక నాయకులకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. 'కల్యాణ్ సార్ మీకు ప్రత్యేకంగా చెప్పమన్నారు. మీతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ క్యాడర్‌ను కూడా తాడేపల్లిగూడెం సభకు తప్పకుండా తీసుకురండి.. మీ అందరూ వస్తేనే సభ సక్సెస్ అవుతుంది.. పార్టీలో ఇబ్బందులు, సీట్ల కేటాయింపు వంటి సమస్యలన్నీ నెమ్మదిగా పరిష్కారమవుతాయి..' అంటూ ఫోన్‌లో సముదాయించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి సత్యనారాయణ (సత్య), టి.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పీఏసీ సభ్యుడు కోన తాతారావు వంటి కొంతమంది నేతలు తాడేపల్లిగూడెం సభకు అయిష్టంగానే పయనమయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నామమాత్రంగానే వెళ్లారు. చాలా మంది నాయకులు ఏదో వంక పెట్టి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


వాలీబాల్ పోటీల విజేత బూసిపుట్టు జట్టుకు బహుమతి అందిస్తున్న ఏఎస్పీ ధీరజ్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువహో పేరుతో నిర్వహించిన వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ ధీరజ్ పాల్గొని మాట్లాడుతూ గిరిజన యువత అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లవద్దని హితవుపలికారు. గిరిజన రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. పోలీసుశాఖ ద్వారా అందిస్తున్న రాజ్మా విత్తనాలు, జీడి, మామిడి, సిల్వర్ మొక్కలను నాటాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం కల్పిస్తున్నామని వాటి సద్వినియోగం చేసుకొని ఎదగాలని అన్నారు. స్థానికుల విన్నపం మేరకు త్వరలో లక్ష్మీపురం పంచాయతీ కేంద్రానికి ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఏఎస్పీ ధీరజ్ బహుమతులు అందజేశారు. గిరిజన క్రీడాకారులకు ఏఎస్పీ ధీరజ్ భోజనాలు వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. పోటీల్లో పాల్గొన్న 40 జట్లకు వాలీబాల్ కిట్లు, టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. జి.మాడుగుల సీఐ రమేష్, ముంచంగిపుట్టు, పెదబయలు ఎస్‌ఐలు రవీంద్ర, మనోజ్‌కుమార్, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, బరడ ఎంపీటీసీ నోట్బో, పోలీసులు, అధిక సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు.

జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు


జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజన యువత జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. ఉసిరిజోన్నల గ్రామంలో బుధవారం జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. పీవో జీడిపిక్కలు ప్రాసెసింగ్‌కు సంబంధించి రైతుతో మాట్లాడారు. యూనిట్‌లో జీడిపిక్కల కొనుగోలు, జీడిపప్పు తయారీ, మార్కెటింగ్, లాభాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏడు మండలాల్లో యువకులకు జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను వెలుగు ద్వారా స్వీకరించి వారి అర్హతలను బట్టి రుణాలతో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జీడిపిక్కల దిగుబడి, కొనుగోలుపై రైతులతో సమావేశం ఏర్పాటుచేశామన్నారు. పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలోని జీడిమామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లును పీవో పరిశీలించారు. కేంద్రంలో ఆర్గానిక్ తాటి బెల్లం, ఆర్గానిక్ నీరా తయారీని పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రంపచోడవరం: కొత్తపాకలు–చిలకమామిడి గ్రామాల మధ్య ఉన్న కొండవాగు ఒడ్డున మడిచర్ల గ్రామానికి చెందిన గిరి మహిళ బిల్లా ఆదిలక్ష్మి(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్.మోహన్‌కుమార్ బుధవారం రాత్రి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మడిచర్ల గ్రామంలో చెలకవీధికి చెందిన ఆదిలక్ష్మి లక్ష్మి క్షయవ్యాధితో బాధపడుతుందన్నారు. వైద్యం కోసం మంగళవారం ఏరియా ఆస్పత్రికి వెళ్లిందని చెప్పారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా కొత్తపాక -చిలకమామిడి గ్రామాల మధ్య వంతెన వద్ద ఉన్న వాగు ఒడ్డున శవమై కనిపించిందన్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు. గతంలో ఆమె భర్త వీరబాబు క్షయ వ్యాధి కారణంగా మృతి చెందినట్టు ఆయన తెలిపారు.

సంప్రదాయ చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి


సదస్సులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: ఐటీడీఏ సమావేశ మందిరంలో సూక్ష్మ, చిన్న మధ్య తరగతి ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ సంప్రదాయ చేతివృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. చేతి వృత్తుల ద్వారా అవసరమైన వారికి శిక్షణ ఇచ్చి, వస్తువుల తయారీ, మార్కెటింగ్ కల్పించి ఆర్థికాభివృద్ధి చెందించడమే పీఎం విశ్వకర్మ పథకం ఉద్దేశమన్నారు. ఈ పథకంలో జిల్లాలో ఇప్పటివరకు 9300 మంది నమోదు చేసుకోగా, పాడేరు డివిజన్ పరిధిలో 5500 మంది నమోదు చేసుకున్నట్టు తెలిపారు. విశాఖపట్నం ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు డి.వి.ఎస్.ఆర్.మూర్తి, ఎంఎస్ఎంఐ ప్రతినిధి పి.నాగకుమార్, జిల్లా పరిశ్రమ కేంద్రం జీఎం శ్రీవాణిధర్ రామన్, ఏడీ ఎం.నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డివిజినల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఆదాయం పొందాలి

ఐటీడీఏ పీవో అభిషేక్


హుకుంపేటలో గిడ్డంగిని పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: గిరిజన రైతులు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రూ.15 లక్షలతో నిర్మించిన గిడ్డంగిని ఆయన పరిశీలించారు. రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను గిడ్డంగిలో భద్రపరుచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించి మంచి ఆదాయం పొందాలని పీవో సూచించారు. గిరిజన ఉత్పత్తులకు అదనపు విలువలు జోడించి గిడ్డంగుల్లో భద్రపరచుకుని మార్కెట్లో అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు విక్రయించాలని కోరారు. వెలుగు ఏపీడీ మురళి, ఏపీఎం చిన్నారావు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి


నుర్మతికొత్తూరులో రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించి, ఆర్థికాభివృద్ధి చెందాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలో నుర్మతి కొత్తూరు గ్రామంలో బుధవారం గొల్లోరి కృష్ణ అనే గిరిజన రైతు షేడ్ నెట్ కింద సాగు చేస్తున్న కూరగాయల సాగును పీవో పరిశీలించారు. రూ.4.63లక్షల వ్యయంతో షేడ్ నెట్ మంజూరు చేశారని డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, పీవోకు వివరించారు. రైతు కూరగాయల సాగు కోసం ఉద్యాన వనశాఖ, బ్యాంకు రుణం తదితర వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రైతుకు అందుతున్న వైఎస్సార్ రైతు భరోసా, ఇతరత్రా పథకాలను పీవో అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై వేంజేప చేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీఏ, ఢిల్లీ క్యాపిటల్స్ సభ్యుల బృందం

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆపరేషన్స్ జట్టు సభ్యులు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డితో చర్చించారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి రెండు మ్యాచ్‌లను హోమ్ గ్రౌండ్‌గా వైఎస్ఆర్ స్టేడియంలో ఆడనుంది. మార్చి 31న చెన్నై సూపర్ కింగ్స్‌తోను, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా మ్యాచ్‌ల నిర్వాహణ, స్టేడియంలో అఫిషియల్స్, ఆటగాళ్లకు కేటాయించే గదులు, కార్పొరేట్ బాక్సులు తదితర ఏర్పాట్లను పరిశీలించి ముందు జాగ్రత్తగా చేపట్టాల్సిన పనులను చర్చించారు. కార్యక్రమంలో ఏసీఏ సీఈవో ఎం.వి.శివారెడ్డి, సీఎఫ్‌ఓ నవీన్‌కుమార్, గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పీఎంపాలెం: చదువుకోవాల్సిన వయసులో దురలవాట్లకు బానిసైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడి.. కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం దారపువానిపేటకు చెందిన దారపు అప్పారావు నగరానికి వలస వచ్చాడు. జీవీఎంసీ 7వ వార్డులోని వాంబేకాలనీ జీఎఫ్–6 లో కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. అతని కుమారుడు సాయికుమార్(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చదువు మీద ఆసక్తి లేకపోవడంతో సుమారు రెండు నెలల నుంచి అతను కళాశాలకు వెళ్లడం లేదు. మద్యం సేవించడం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం తదితర చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. కాగా.. ఈ నెల 27న కుమారుడిని ఇంటివద్దనే ఉంచి అప్పా రావు తన స్వగ్రామంలో జరుగుతున్న ఇంటి నిర్మాణపు పనులు చూసేందుకు భార్యతో కలసి వెళ్లాడు. జీవితం మీద విరక్తి చెందిన సాయికుమార్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు.. అప్పారావుకు ఫోన్‌లో తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన


క్విజ్, పోటీలో విజేతలకు బహుమతి అందజేస్తున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవితేజ తదితరులు

హుకుంపేట: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్.రవితేజ మాట్లాడుతూ బ్యాంకింగ్ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, పొదుపు పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు చిన్నమ్మి, దీక్షిత, సుస్మిత, శైలు, చాందిని, సజ్జోయని బృంద సభ్యులు బహుమతులు పొందారు. డుంబ్రిగుడ యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్, హుకుంపేట బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ గోపి పాల్గొన్నారు.

యువతిని రక్షించిన పోలీసులు

అల్లిపురం: ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్.కె.బీచ్‌కు వచ్చిన యువతిని నగర పోలీసులు రక్షించారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన సరిపల్లి రమ్య ఇంట్లో గొడవపడి చనిపోదామని నేరుగా ఆర్.కె.బీచ్‌కు వచ్చింది. ఆమె కదలికలపై అనుమానం రావడంతో అబిష్ అనే వ్యక్తి రాత్రి 10.35 సమయంలో డయల్ 112కు ఫోన్ చేసి.. ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని సమాచారం అందించాడు. కంట్రోల్ రూం నుంచి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో... దిశా మొబైల్, ఆర్.కె.బీచ్ టూరిస్టు పోలీస్ స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కేబీవీ కిశోర్, దిశ మొబైల్ డ్రైవర్ నారాయణరావు బీచ్‌లో గాలించారు. వారికి అమ్మాయి కనిపించడంతో ప్రశ్నించి.. మూడో పట్టణపోలీస్ స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ ఇచ్చి.. ఆమె అన్నయ్య భానుప్రసాద్‌ను పిలిపించి అప్పగించారు. సమాచారం ఇచ్చిన యువకుడిని, సకాలంలో బాధితురాలిని గుర్తించి, ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడిన పోలీస్ సిబ్బందిని సీపీ రవిశంకర్ అభినందించారు.